క్లుప్తంగా

స్టీల్ ప్లాంట్ పరిరక్షణకు ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న నాయకులు

విశాఖ విద్య: స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరించ వద్దని డిమాండ్ చేస్తూ అఖిల పక్షం ఆధ్వర్యంలో ఆదివారం ర్యాలీ నిర్వహించారు. స్టీల్ ప్లాంట్ నుంచి ప్రారంభించిన ర్యాలీ జీవీఎంసీ ప్రధాన కార్యాలయం వరకు సాగింది. దీనిలో భాగంగా ఎస్‌పీడీ సెంటర్‌లో ర్యాలీకి స్థానిక నాయకులు స్వాగతం పలికారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రధాని మోదీ డౌన్ డౌన్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.

రూ.15 లక్షలతో గ్రంథాలయం అభివృద్ధి

విశాఖ విద్య: జీవీఎంసీ 90వ వార్డు బుచ్చిరాజుపాలెం గాంధీనగర్‌లో రూ.15 లక్షలతో గ్రంథాలయ(కమ్యూనిటీ హాల్) అభివృద్ధి పనులకు ఆదివారం కార్పొరేటర్ బొమ్మిడి రమణ శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ జీవీఎంసీ నిధులతో గాంధీ నగర్‌లో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో గాంధీ నగర్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు కొండలరావు, కృష్ణారావు,రవి, సంతోష్ కుమార్, ప్రసాద్, కళ, పద్మ, అన్నపూర్ణ పాల్గొన్నారు.

ఎర్నిమాంబకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో ఎర్నిమాంబ అమ్మవారు

కంచరపాలెం : జ్ఞానాపురం పరిధి కాన్వెంటు కూడలిలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం పుష్య మాస శుద్ధ అష్టమి ఆదివారాన్ని పురస్కరించుకుని భక్తులతో కిటకిటలాడింది. ఆలయ పూజారమ్మ వాసుపల్లి విజయమ్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ప్రధాన అర్చకులు పులఖండం శ్రీకాంత్ శర్మ ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు, విశేషార్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ప్రత్యేక ఉచిత దర్శనాలతో పాటు రూ.10, రూ. 50 దర్శనాలు కూడా కల్పించారు. దూరప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆలయ పరిసరాల్లో వంటా వార్పు చేసుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ సిబ్బంది రామకృష్ణ, ప్రసాద్, జోజిబాబు భక్తుల సౌకర్యాలను పర్యవేక్షించారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం



తాళ్లవలసలో ప్రచారం చేస్తున్న ప్రబోధ సేవా సమితి ప్రతినిధులు

తగరపువలస : త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, హిందూ జ్ఞాన వేదిక, విజయరాం పురం కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం భీమిలి మండలం తాళ్లవలసలో ఇంటింటా ప్రచారం చేశారు. భగవద్గీతతోపాటు త్రైత సిద్ధాంత అనుబంధ గ్రంథాలు, శివరాత్రి ఆవశ్యకతను వివరించారు. జాగరణ ఉద్దేశ్యం తెలియజేశారు. కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు కనకల త్రినాథరావు, వి.సురేష్, ఎస్.శ్రీనివాస్, బి.పైడన్న, కె.రాజు, కె.సంతోష్, కె.బంగారుతల్లి తదితరులు పాల్గొన్నారు.

చుక్కల మందుకు చక్కని స్పందన



52వ వార్డు శివాలయం వద్ద పిల్లలకు చుక్కలు వేస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీధర్



కాకాని నగర్ కేంద్రం వద్ద పిల్లలతో క్యూ కట్టిన తల్లిదండ్రులు



58వ వార్డులో పిల్లలకు చుక్కల మందు వేస్తున్న కార్పొరేటర్ లావణ్య



కార్యక్రమంలో పాల్గొన్న 61వ వార్డు నాయకులు



కొత్తపాలెంలో చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తున్న వైద్యుడు వికాస్



90వ వార్డు బుచ్చిరాజుపాలెంలో కేంద్రాన్ని పరిశీలిస్తున్న డాక్టర్ రేవతి

విశాఖ విద్య: పోలియో వ్యాధి నిర్మూలనకు రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం నిర్వహించిన పోలియో చుక్కల మందు పంపిణీ కార్యక్రమానికి అనూహ్య స్పందన లభించింది. వైద్య ఆరోగ్య, సచివాలయ సిబ్బంది విస్తృత ప్రచారం చేయడంతో తమ పిల్లలకు పోలియో చుక్కలు వేయించేందుకు తల్లిదండ్రులు ఆసక్తి కనబరిచారు.

- ఎస్‌పీడీ కాకాని నగర్ సచివాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన బూత్‌లో పిల్లలతో తల్లిదండ్రులు క్యూ కట్టారు. మూడు రోజుల పాటు పోలియో చుక్కల మందు పంపిణీ కోసం వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో తగిన ఏర్పాటు చేశారు. తొలిరోజు కార్యక్రమం విజయవంతమైంది.
- 52 వ వార్డులో నిర్వహించిన కార్యక్రమాన్ని డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ ప్రారంభించారు. కరాసా ప్రైమరీ పాఠశాల, ఎస్‌పీడీ శివాలయం, వుడాలే అవుట్ వినాయకుడి గుడి తదితర ప్రాంతాల్లోని బూత్‌లను ఆయన సందర్శించి పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. కార్యక్రమంలో వార్డు హెల్త్ సెక్రటరీలు, వార్డు వలంటీర్లు పాల్గొన్నారు.
- 90వ వార్డు ఎస్‌ఎస్‌టీఎల్ గేటు వద్ద గల యూపీహెచ్‌సీ, బుచ్చిరాజుపాలెం రెడ్డి వీధి రామలయం, కాకాని నాగర్ సచివాలయంలో ఏర్పాటు చేసిన బూత్‌ల్లో కార్పొరేటర్ బొమ్మిడి రమణ పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. కేంద్రాలను యూపీహెచ్‌సీ డాక్టర్ రొంగలి రేవతి సందర్శించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.సోమ, మంగళవారాల్లో ఇంటింటికీ తిరిగి మిగిలిన పిల్లలందరికీ చుక్కల మందు వేయాలని సూచించారు.

సింధియా: జీవీఎంసీ 40వ వార్డు పరిధిలోని పలు ప్రాంతాల్లో నిర్వహించిన పల్స్‌పోలియో కార్యక్రమాన్ని వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు ప్రారంభించారు. చిన్నారులకు చుక్కల మందు వేశారు. కార్యక్రమంలో యూపీహెచ్‌సీ డాక్టర్ నాయుడు, నాయకులు వరపల మహేష్, కొట్నాన రవి, పెంట్ల బాలకృష్ణ, మీసాల సత్యనారాయణ, యలగాడ రాజు, చొక్కాపు రమణ, దేబార్కి రాంప్రసాద్ పాల్గొన్నారు

- జీవీఎంసీ 62వ వార్డు పరిధిలోని పలు ప్రాంతాల్లో 5 ఏళ్ల లోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు.
- జీవీఎంసీ 63వ వార్డు పరిధిలోని కాకరలోవ, చింతల్లోవ, జయేంద్రకాలనీ తదితర ప్రాంతాల్లో వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి పిలక రామ్మోహనరెడ్డి పాల్గొని 5 ఏళ్ల లోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షులు సోమాదుల సురేష్, పెంటారావు, వైద్యారోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

వాడవాడలా పల్స్ పోలియో

గోపాలపట్నం: జీవీఎంసీ 89, 91, 92 వార్డుల్లో పల్స్ పోలియో కార్యక్రమం జరిగింది.ఆయా వార్డుల్లో పలు చోట్ల ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేశారు. బాజీజంక్షన్, పాత గోపాలపట్నం, గోపాలపట్నం ప్రధాన రహదారి, కొత్తపాలెంలో ఇలా పలు చోట్ల ఏర్పాటు చేసిన బూత్‌లలో నాయకులు, పెద్దలు పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. 89వ వార్డు క్లస్టర్ అధ్యక్షుడు అయితంశెట్టి రేణుకా గోపాలకృష్ణ పలువురు చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు.

- బాజీ జంక్షన్ రెడ్డి వీధిలో ఏర్పాటు చేసిన శిబిరాన్ని బెహరా ఆస్పత్రి ఎండీ బెహరా రవితేజ సందర్శించారు. చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఆయన మాట్లాడుతూ గతంలో పోలియో మహమ్మారిలా ఉండేదని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు దీనిపై సుదీర్ఘ పోరాటం చేయడంతో అదుపులోకి వచ్చిందన్నారు.

95 శాతం పూర్తి

89, 92 వార్డుల్లోని 12 బూత్‌లలో 95 శాతం చిన్నారులకు పోలియో చుక్కలు వేశామని చంద్రనగర్ పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి వికాస్ తెలిపారు. 91, 92 వార్డుల పరిధిలో సుమారు 90 శాతం పోలియో చుక్కలు కార్యక్రమం నిర్వహించామని లక్ష్మీనగర్ పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యురాలు పూజ తెలిపారు. మిగిలిన వారికి ఇంటింటికీ వెళ్లి పోలియో చుక్కలు వేయిస్తామని చెప్పారు.

పారిశ్రామిక ప్రాంతంలో..

మల్కాపురం: ఐదేళ్ల లోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయించాలని 58వ వార్డు కార్పొరేటర్ లావణ్య అన్నారు. ములగాడ యూపీహెచ్‌సీ, గుల్లలపాలెం సామాజిక భవనం నిర్వహించిన కార్యక్రమాల్లో ఆమె పిల్లలకు చుక్కల మందు వేశారు.

- పిలకవానిపాలెం సామాజికభవనం వద్ద ఏర్పాటు చేసిన బూత్‌లో వ్యవసాయ మార్కెటింగ్ బోర్డు డైరెక్టర్ చుక్క వరలక్ష్మి చిన్నారులకు పోలియో చుక్కలు చేశారు.
- 59వ వార్డు లేబర్ జంక్షన్,ఎక్స్ సర్వీస్‌మెన్‌కాలనీ తదితర ప్రాంతాల్లో వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు రేవళ్ల సత్యనారాయణ, యూపీహెచ్ వైద్య సిబ్బంది చిన్నారులకు చుక్కల మందు వేశారు.
- 60వ వార్డు శ్రీహరిపురం,జవహర్‌నగర్,ఇందిరాకాలనీల్లో వార్డు కార్పొరేటర్ పి.వి.సురేష్,పార్టీ నాయకుడు ఆడారి హరీష్ తదితరులు పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు.
- 61వ వార్డు మల్కాపురం,ప్రకాష్‌నగర్,గాంధీజీ వీధి వద్ద జరిగిన పోలియో చుక్కల కార్యక్రమాలలో వార్డు పార్టీ నాయకులు దాడి సత్యనారాయణ,చట్టి నూకరాజుయాదవ్,బూసి అప్పలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



40వ వార్డులో పోలియో చుక్కలు వేస్తున్న కార్పొరేటర్ నాగేశ్వరరావు



62వ వార్డులో పోలియో చుక్కలు వేస్తున్న నాయకులు



63వ వార్డులో పోలియో చుక్కలు వేస్తున్న రామ్మోహనరెడ్డి



పాఠశాలలో చిన్నారులకు చుక్కల మందు వేస్తున్న రేణుకా గోపాలకృష్ణ



బాజీ జంక్షన్ ప్రాథమిక పాఠశాలలో చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తున్న బెహరా రవితేజ

దుర్గమ్మా.. చల్లగ చూడమ్మా

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు వెంకన్నపాలెంలో భవాని భక్తులు జిబ్బిడి మణికంఠ,బాలాజీయాదవ్ ఆధ్వర్యంలో దుర్గాదేవి పూజలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా ఇక్కడ భక్తులు అమ్మవారి పీఠం ఏర్పాటు చేసి దుర్గాదేవి విగ్రహం నెలకొల్పి పూజలు చేశారు. ఈ సందర్భంగా పలువురు భవాని భక్తులు నోటికి శూలాలు గుచ్చుకుని ఊరేగింపుగా ముందుకు సాగారు. పీఠం వద్ద సాయంత్రం అగ్నిగుండం ఏర్పాటు చేసి వాటిపై భక్తులు అమ్మవారి కీర్తనలను ఆలపిస్తూ నడిచారు. అనంతరం పలువురు భక్తులు అమ్మవారి విగ్రహాలను తలపై పెట్టుకుని, వివిధ పిండి వంటలతో పుర వీధుల్లో ఊరేగించారు. ఏటా శివరాత్రి ముందు దుర్గాదేవి పూజలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని నిర్వాహకులు తెలిపారు.



అమ్మవారి విగ్రహాలను తలపై పెట్టుకుని ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు

పూజలు అనంతరం అమ్మవారి విగ్రహంతో నగరంలోని పూర్ణామార్కెట్ వద్ద గల దుర్గాదేవి ఆలయానికి తీసుకువెళ్లి పూజలు చేయనున్నట్టు నిర్వాహకులు మణికంఠ,బాలాజీయాదవ్ తెలిపారు.

140 ఎపిసోడ్‌లతో 'ఘంటసాల గాన మాధుర్యం'

ఘంటసాల గ్లోబల్ ప్రాజెక్టు వ్యవస్థాపకుడు డాక్టర్ శరత్‌చంద్ర

డాబాగార్డెన్స్: ఘంటసాల గ్లోబల్ ప్రాజెక్టు వ్యవస్థాపకుడు డాక్టర్ టి.శరత్‌చంద్ర సారథ్యంలో ఆదివారం డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఐడల్ గంధర్వ పేరిట గాయనీగాయకుల ఎంపిక నిర్వహించారు. కనకమహాలక్ష్మి దేవస్థానం మాజీ చైర్మన్ వంకాయల సన్యాసిరాజు, అమెరికాకు చెందిన జి.రాము, ఎన్నారై కె.సుధారాణి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. 10 ఏళ్ల నుంచి 90 ఏళ్ల వయసు గల ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన గాయనీగాయకులు పాల్గొని పాటలు పాడారు. వీరిలో ప్రతిభ చూపిన వారిని ఎంపిక చేశారు. త్వరలో ఘంటసాల గాన మాధుర్యాన్ని కీర్తిస్తూ ప్రసారమాధ్యమాల ద్వారా 140 ఎపిసోడ్‌లతో ప్రేక్షకుల చెంతకు ఈ కార్యక్రమం చేరుతుందని డాక్టర్ శరత్ చంద్ర ఈ సందర్భంగా తెలిపారు. వి.రాజేంద్రప్రసాద్, జీవీఎంసీ సెక్రటరీ పి.నల్లనయ్య, సుబ్రహ్మణ్య శర్మ, ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్, జె.పృథ్వీరాజ్, మెలోడి సత్యనారాయణ, కందర్ప రాధ, నిర్వాహకులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వంకాయల సన్యాసిరాజు

నేడు ఐడల్ గంధర్వ లోగో ఆవిష్కరణ

అల్లూరి విజ్ఞాన కేంద్రంలో సోమవారం సాయంత్రం 6 గంటలకు ఉత్తరాంధ్ర ఘంటసాల స్మారకపీఠం వ్యవస్థాపకుడు డాక్టర్ టి.శరత్ చంద్ర నేతృత్వంలో ఐడల్ గంధర్వ లోగోను సినీ నటుడు సుమన్ ఆవిష్కరించనున్నారు. అనంతరం స్వరాభిషేకం, పాడుతా తీయగా గాయనీగాయకులతో సినీ సంగీత విభావరి, మిమిక్రీ కళాకారుడు శివారెడ్డి ధ్వని అనుకరణ కార్యక్రమం నిర్వహించనున్నారు. జి.రాముకి జీవిత సాఫల్య పురస్కారాన్ని సుమన్ చేతుల మీదుగా అందజేయనున్నారు.

సూర్యనారాయణమూర్తికి ప్రత్యేక పూజలు



విశేష అలంకరణలో సూర్యనారాయణమూర్తి



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

అల్లిపురం : వెంకటేశ్వర మెట్టపై అలమేలు మంగమ్మ ఆలయంలో వెలసిన శ్రీ సూర్యనారాయణమూర్తి దేవాలయంలో మాఘమాసం నాల్గవ ఆదివారం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. తెల్లవారు జాము నుంచే స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. ఆలయ అర్చకులు పాణంగిపల్లి కేశవాచార్యులు ఆధ్వర్యంలో మూలవిరాట్టుకు గోక్షీరంతో అభిషేకం, పంచామృతాభిషేకాలు చేపట్టారు. అనంతరం మందార, చామంతి, గులాబీ పుష్పాలతో స్వామి వారిని విశేషంగా అలంకరించారు. అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించి ప్రసాదాలు అందజేశారు.

ఆఖరివారం ప్రత్యేక పూజలు..

మాఘ మాసం ఆఖరి ఆదివారం సందర్భంగా 10వ తేదీన మూలవిరాట్టుకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకుడు పాణంగిపల్లి కేశవాచార్యులు తెలిపారు.

ఉత్సాహంగా 'చదువంటే మాకిష్టం'

పెదగంట్యాడ: స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం చదువంటే మాకిష్టం కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. గ్రంథాలయ శాఖాధికారి రమణ విద్యార్థులతో కథలు పుస్తకాలు చదివించి, అందులోని నీతిని బోధించారు.

పోరాటాలతో ఉక్కు పరిశ్రమను కాపాడుకుంటాం

కూర్మన్నపాలెం: ఎందరికో ఉపాధినిస్తున్న విశాఖ ఉక్కు పరిశ్రమను కార్మికులందరూ పోరాటాలతో కాపాడుకుంటారని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు పేర్కొన్నారు. కూర్మన్నపాలెం కూడలి వద్ద జరుగుతున్న ఉక్కు రిలే నిరాహార దీక్షలు ఆదివారం నాటికి 1,116వ రోజుకు చేరుకున్నాయి. సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు, ఉక్కు నిర్వాసితులు పాల్గొన్నారు. ముందుగా స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ కూర్మన్నపాలెం కూడలిలోని దీక్షా శిబిరం నుంచి నగరంలోని జీవీఎంసీ కార్యాలయం వద్ద గాంధీ విగ్రహం వరకు పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ దేశ చరిత్రలో అనేక మంది ప్రధాన మంత్రులు ప్రభుత్వరంగ సంస్థలను నెలకొల్పి పేద, బడుగు, బలహీనవర్గాల ప్రజలకు ఉపాధి అవకాశాలు మెరుగుపరిచారన్నారు. నేటి పాలకులు ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరిస్తూ పేదల జీవితాలను సర్వనాశనం చేస్తున్నారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ పెద్దలు విశాఖ ఉక్కుపరిశ్రమ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని విరమించుకోవాలని కోరారు.

అమ్మవారి ఉత్సవ బ్రోచర్ ఆవిష్కరణ



ఉత్సవ బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న స్వరూపానందేంద్ర సరస్వతి మహా స్వామీజీ తదితరులు

అల్లిపురం : అస్సాం గార్డెన్స్‌లో వెలసిన నీలమ్మ వేపచెట్టు అమ్మవారి వార్షిక ఉత్సవాలు ఈ నెల 7, 8 తేదీల్లో జరగనున్నాయి. ఈ మేరకు ఉత్సవ బ్రోచర్‌ను శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి మహా స్వామీజీ ఆదివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకుడు జోగారావు శర్మ, బోర శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వినికిడి సమస్యలపై నిర్లక్ష్యం వద్దు



కిమ్స్ ఐకాన్‌లో వినికిడి పరీక్షలు చేస్తున్న డాక్టర్ సాయిబలరామకృష్ణ

అక్కిరెడ్డిపాలెం: అంతర్జాతీయ వినికిడి దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం షీలానగర్‌లోని కిమ్స్ ఐకాన్ ఆస్పత్రిలో వినికిడి పరీక్షలు నిర్వహించారు. ఈఎన్‌టీ వైద్యుడు డాక్టర్ సాయి బాలరామకృష్ణ 40 నుంచి 50 మందికి ఉచిత వినికిడి పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొందరికి వినికిడి సామర్థ్యం పుట్టుకతోనే ఉండదని, అలాంటి వారిని వదిలేయకుండా కాక్లియర్ ఇంప్లాంట్ శస్త్ర చికిత్స చేయిస్తే చక్కగా వినగలగడమే కాకుండా మాట్లాడే అవకాశం వస్తుందన్నారు. వినికిడి సమస్యలను నిర్లక్ష్యం చేయడం ద్వారా చిన్నారులు వినలేకపోవడం, మాటలు రాకపోవడం వంటి సమస్యలు ఉత్పన్నమవుతాయన్నారు. శిశువు జన్మించిన వెంటనే వినికిడి పరీక్షలు చేయడం ద్వారా సమస్యలు ముందుగానే గుర్తించవచ్చని చెప్పారు.

అపూర్వ కలయిక



గాజువాక హైస్కూల్‌లో పూర్వ విద్యార్థులు

పెదగంట్యాడ: గాజువాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2003 – 2004లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనంలో కలిశారు. ఈ సందర్భంగా ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని, గత స్మృతులను నెమరువేసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తామంతా అసోసియేషన్‌గా ఏర్పడి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. సహచర మిత్రులకు ఆర్థిక సాయం చేస్తున్నామని వివరించారు. భవిష్యత్‌లో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నామన్నారు. ముందుగా తమతో కలసి చదువుకుని మృతి చెందిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ మౌనం పాటించారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మూర్తిని ఘనంగా సత్కరించారు.

ముగ్గురిని కాపాడిన జీవీఎంసీ లైఫ్‌గార్డ్స్



బర్మాకాలనీకి చెందిన వృద్ధురాలిని రక్షించిన జీవీఎంసీ లైఫ్‌గార్డ్స్

డాబాగార్డెన్స్: ఆర్.కె.బీచ్, రుషికొండ బీచ్‌ల్లో ముగ్గురిని జీవీఎంసీ లైఫ్‌గార్డ్స్ రక్షించి ప్రాణాలు కాపాడారు. విశాఖ బర్మాకాలనీకి చెందిన 60 ఏళ్ల నక్కా లక్ష్మమ్మ అనారోగ్యం కారణంగా మనస్తాపంతో ఆర్.కె.బీచ్‌లో దిగి శనివారం ఆత్మహత్యకు యత్నించింది. ఇది గమనించిన లైఫ్‌గార్డ్స్ ఆమెను రక్షించారు. రుషికొండ బీచ్‌లో శనివారం సముద్రంలో చిక్కుకున్న ఇద్దరు పర్యాటకులను లైఫ్‌గార్డ్స్ జె.హరీష్, ఎం.నవీన్, టి.పోలిరాజు, ఓ.రాజు, జి.చిన్న, అప్పన్న, కె.రాజు రక్షించి ప్రాణాలు కాపాడారు. ముగ్గురి ప్రాణాలు కాపాడిన లైఫ్‌గార్డ్స్‌ను జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ ఈ సందర్భంగా అభినందించారు. శివరాత్రికి సముద్ర స్నానాలకు అధిక సంఖ్యలో భక్తులు రానున్న దృష్ట్యా ప్రమాదాలు సంభవించకుండా జీవీఎంసీ ముందస్తు చర్యలు చేపట్టిందన్నారు. బీచ్‌లో ప్రత్యేక రోబోటిక్ యంత్రాలు అందుబాటులో ఉంచినట్లు కమిషనర్ వెల్లడించారు.

ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు

కొమ్మాది: సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం వారాంతపు పూజల్లో భాగంగా హరేకృష్ణ, హరేరామ నామస్మరణతో ప్రత్యేక పూజలు చేశారు. రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర, జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ, నరసింహస్వామి విగ్రహాలను వివిధ వర్ణాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామివారి లీలలు, మహిమలు వర్ణిస్తూ భక్తులు భజనలు, గీతాలాపన చేశారు.



ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు